క్లుప్తంగా

రికార్డుల పరిశీలన

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో శనివారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ ఉంచాలని ఆదేశించారు. రోడ్ల వెంట మొక్కలకు నీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసీఆర్ ఆరోగ్య కిట్లు



మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో ఉండవెల్లి మండలానికి చెందిన జ్యోతికి ఎంసీఆర్ ఆరోగ్య కిట్లు అందించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, ఏఎన్‌ఎమ్ మాబమ్మ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జొన్నలబస్తాతో శ్రీశైలానికి పాదయాత్ర



గట్టు: దైవభక్తిని చాటుకునేందుకు ఒక్కో భక్తుడు ఒక్కో విధంగా భక్తిని చాటుకుంటున్నారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా సిందగి ప్రాంతానికి చెందిన ఓ యువ రైతు శ్రీశైలం మల్లన్నపై భక్తితో పండించిన జొన్న పంటలోని 50 కేజీల బస్తాను స్వయంగా మోసుకెళ్లి, శ్రీశైలం మల్లన్నకు సమర్పించాలనుకున్నాడు. దీంతో ఇప్పటి దాకా సుమారు 160 కిలోమీటర్ల దూరం 50 కేజీల జొన్న బస్తాను మోసుకుంటూ శ్రీశైలం వెళ్తూ శనివారం బల్గెరకు చేరుకున్నాడు. బల్గెర దగ్గర చెట్టు కింది కాసేపు సేద తీరి, మళ్లీ అక్కడి నుంచి శ్రీశైలానికి పాదయాత్ర ప్రారంభించారు. తోడుగా మరో వ్యక్తితో కలిసి శ్రీశైలానికి చేరుకుని జొన్న బస్తాను శ్రీశైలం మల్లన్నకు మొక్కుగా చెల్లించనున్నట్లు కర్ణాటక భక్తుడు తెలిపారు.

పాదయాత్రికుల సేవలో గ్రామీణ వైద్యులు



గట్టు: పాదయాత్రికుల సేవలో కర్ణాటకకు చెందిన గ్రామీణ వైద్యులు తరించి పోతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైలానికి పాదయాత్ర చేసుకుంటూ వచ్చే భక్తులకు గట్టులో కర్ణాటక చెందిన వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య సేవలు ఊరట నిస్తున్నాయి. సిందగి ప్రాంతానికి చెందిన ఆర్బిట్ ఫస్ట్ ఎయిడ్ ట్రైయినింగ్ సెంటర్, ధన్వంతరి వైద్యశాలకు చెందిన వారు దాతలు సమకూర్చిన సుమారు రూ.5 లక్షలు విలువ చేసే మందులు తీసుకొచ్చి, పాదయాత్రికులకు అందజేస్తున్నారు. కర్ణాటక నుంచి గట్టు మీదుగా శ్రీశైలం వెళ్తున్న పాదయాత్రికులకు కర్ణాటకకు చెందిన గ్రామీణ వైద్యులు ఉచిత వైద్య సేవలను అందజేస్తున్నారు. ఇప్పటికే మూడు రోజులు వైద్య సేవలు చేశామని, మరో రెండు రోజులు వైద్య సేవలు అందజేస్తామని తెలిపారు.

డీలర్లు వివరాలు ఇవ్వాలి

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో ఎరువులు, పురుగు మందులతో పాటు విత్తనాలను విక్రయించే డీలర్లు మార్చి నెల ముగిసినందున ముగింపు వివరాలను మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో అందజేయాలని ఏఓ అయూబ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి డీలర్లు విత్తన, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన కొత్త స్టాకు రిజిస్టర్ పుస్తకాలను తీసుకొని నిల్వ స్టాకును వాటిలో నమోదు చేసి మండల వ్యవసాయ అధికారితో సర్టిపై చేయించుకోవాలని ఆయన సూచించారు.

మోటార్ సైకిళ్లు ఢీ : ముగ్గురికి గాయాలు

శాంతినగర్: మోటార్ సైకిళ్లు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన జూలెకల్ స్టేజీ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్ వివరాల ప్రకారం.. వడ్డేపల్లి మండలం బుడమొర్సుకు చెందిన నర్సింహులు, పార్వతమ్మ దంపతులు సొంత పని నిమిత్తం అయిజ మండలం బింగిదొడ్డికి శుక్రవారం ఉదయం వెళ్లారు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో జూలెకల్ శివారులోని శివాలయం సమీపంలో శాంతినగర్ వైపు నుంచి మోటార్‌సైకిల్‌పై అతివేగంగా వస్తున్న ఎమ్మిగనూర్‌కు చెందిన రాజేష్ కారును ఓవర్‌టేక్ చేయబోయి వీరి వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బుడమొర్సుకు చెందిన దంపతులతో పాటు రాజేష్ రోడ్డుపై పడ్డారు. రాజేష్, నర్సింహులుకు తీవ్ర గాయాలుకాగా, పార్వతమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ముగ్గురిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీచుపల్లిలో భక్తులకు నీటి కష్టాలు

- పూర్తిగా ఎండిపోయిన కృష్ణమ్మ
- పుష్కరఘాట్‌లో స్నానాలకు నీరు కరువు
- జాడలేని మూత్రశాలలు, మరుగుదొడ్లు
- పట్టించుకోని పాలకమండలి, అధికారులు



బీచుపల్లి ఆలయ ముఖద్వారం



పుష్కరఘాట్ దగ్గర ఎండిపోయిన కృష్ణానది.

ఎర్రవల్లిచౌరస్తా: పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో రోజురోజుకు భక్తులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది మొదటి నుంచి వర్షాలు సక్రమంగా లేకపోవడంతో జూరాల ప్రాజెక్టులో నీరు లేక కృష్ణానది పూర్తిగా ఎండి పోయింది. దీంతో నిత్యం బీచుపల్లి ఆలయానికి వచ్చే భక్తులకు స్నానాలు చేసేందుకు నీరులేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తుల కోసం గతంలో ఏర్పాటు చేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లు సైతం ఉపయోగంలో లేకపోవడంతో ఆలయానికి వచ్చిన మహిళల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. పుణ్యక్షేత్రంలో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ఆలయ పాలకమండలి సభ్యులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు, భక్తుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మినీ నీటిట్యాంకు దగ్గరనే స్నానాలు..

పవిత్ర దక్షిణ వాహినిగా పేరుగాంచిన కృష్ణానది పూర్తిగా ఎండిపోయింది. నదిలో ఎక్కడ చూసినా నీటి చుక్క జాడే కరువైంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ అధికారులు పుష్కరఘాట్ దగ్గర కనీసం బోరు సహాయంతో నల్లాలను ఏర్పాటు చేసినా స్నానాలు చేసేందుకు వీలుంటుందని పలుమార్లు విన్నవించినా ఎవరికీ భక్తుల గోస వినపడడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక ఆంజనేయస్వామి ఆలయం ముందు 40 ఏళ్ల క్రితం నిర్మించిన మినీ నీటి ట్యాంకు వద్దే మహిళలు, పురుషులు స్నానాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.



ఆలయం దగ్గర బహిరంగ ప్రదేశంలో స్నానాలు చేస్తున్న భక్తులు

మరుగునపడ్డ మరుగుదొడ్లు

బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి ప్రతి శనివారం, మంగళవారం, ప్రతినెల అమావాస్యకు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో మహిళల కోసం 2016 కృష్ణా పుష్కరాల సమయంలో ప్రత్యేకంగా మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించారు. కానీ ఆలయ సిబ్బంది నిర్వహణ లోపం వల్ల కొంతకాలంగా పూర్తిగా మరుగునపడ్డాయి. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భక్తుల నుంచి వివిధ రూపాల్లో వసూలు చేస్తున్న డబ్బుతో సౌకర్యాలు కల్పించడంలో పాలకమండలి ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

స్నానాలకు ఇబ్బందులు తప్పడంలేదు



బీచుపల్లి పుణ్యక్షేత్రంలో స్నానాలు చేయాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. ఆలయ సమీపంలో ఉన్న కృష్ణానది పూర్తి స్థాయిలో ఎండిపోయింది. దీంతో పుష్కరఘాట్‌లో ఎక్కడా స్నానాలు చేయడానికి వీలులేదు. కేవలం ఆలయం ముందున్న మినీ ట్యాంకు దగ్గర బహిరంగ ప్రదేశంలో మాత్రమే స్నానం చేయాల్సి వస్తోంది. మహిళల కోసం ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడంతో ఆలయానికి వచ్చే మహిళలు స్నానాలు చేయడం కోసం ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి భక్తుల సమస్యలను పరిష్కరించాలి.

– అశోక్‌కుమార్‌రెడ్డి, భక్తుడు

నూతన ట్యాంకు ఏర్పాటు చేస్తున్నాం..



బీచుపల్లిలో కృష్ణానది ఎండిపోవడంతో ఆలయాలకు వచ్చే భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం భక్తులు తక్కువ సంఖ్యలోనే వస్తున్నారు దీని కోసం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న ట్యాంకును వినియోగిస్తున్నారు. ఆలయం సమీపంలోనే మరొక నూతన ట్యాంకును ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే 15 రోజుల్లో కొత్త ట్యాంకు నిర్మాణం పూర్తిచేసి భక్తులు స్నానాలు చేయడం కోసం ఇబ్బంది లేకుండా చూస్తాం. మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయడం కోసం సులబ్ వాళ్లకు టెండర్ ఇచ్చాం. మే నెలలో ఉత్సవాలు ఉండటంతో సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించాం. ఉత్సవాల లోపు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– రామన్‌గౌడ్, ఆలయ ఈఓ

మే నెలలో బీచుపల్లి ఉత్సవాలు..

వచ్చే మే నెల 23 నుంచి బీచుపల్లి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలు నెల రోజుల పాటు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి శనివారం నైవేద్య దాసంగాలతో ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ప్రస్తుతం కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలకు నీటి చుక్క కరువైంది. స్నానాలు చేసేందుకు భక్తుల కోసం ఇప్పటి వరకు ఆలయ అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదు. ఈ సారి ఉత్సవాల్లో భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే భక్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు



గట్టులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినులు



మల్దకల్‌లో బయటికి వస్తున్న విద్యార్థులు

అయిజ: పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. డిపార్ట్ మెంటల్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఠాగూర్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బ్రైట్ స్టార్, కృష్ణవేణి హైస్కూల్, మండలంలోని ఉత్తనూరులో మొత్తం 986 మంది విద్యార్థులకు గాను, 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఒకేషనల్ (వృత్తి విద్య) పరీక్ష నిర్వహించనున్నారు.

మానవపాడు: అధికారులు, సిబ్బంది సహకారంతో పది పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించామని చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు. మండలకేంద్రంలో 284 మొత్తం ఉండగా, 283మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పేపర్ కస్టోడియాన్ విష్ణువర్ధన్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో పోలీస్‌లు నిత్యం పహారా కాశారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి, పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ జుబేర్ మోహీనుద్దీన్, ఎస్‌ఐ సురేష్‌గౌడు తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు శివశంకర్, జహిరుద్దీన్, శోభారాణిలు ఉనారు. చివరి రోజు పరీక్షకు 467మందికి గాను, 466 మంది హాజరయ్యారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 137 మంది, ప్రైమరీ పాఠశాలలో 131 మంది, మైనార్టీ గురుకుల పాఠశాలలో 150 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ధరూరు: సోషల్ స్టడీస్ పరీక్షతో పరీక్షలు ముగిసినట్లు అధికారులు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

గట్టు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలతో పాటుగా మాచర్ల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలు ముగియడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటుగా తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



ఉండవెల్లిలో బయటకు వస్తున్న విద్యార్థులు



ధరూరులో..

బీజేపీలో చేరిన యువకులు



బీజేపీలో చేరిన యువకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు యూత్ సభ్యులు శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో వల్లూరు, ధర్మవరం, బీ వీరాపురం, షాబాద్, వేముల గ్రామాలకు చెందిన సుమారు 100మంది యువకులు చేరారు. శాంతినగర్‌లో నిర్వహించిన బీజేపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. యువకులకు నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించినట్లు వారు పేర్కొన్నారు.

దేశంకోసం ఓటేయ్యాలి

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరు, తక్కశిల, ఉండవెల్లి గ్రామాల్లో నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ కుమార్ ప్రచారం నిర్వహించారు. ఓటు వేసే సమయంలో దేశం గురించి ఆలోచించి ఓటేయ్యాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు పిడుగు వెంకటేష్ పాల్గొన్నారు.

ఓటీపీ చెప్పగానే రూ.83వేలు మాయం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు రమాదేవి 2023 నవంబర్ 6వ తేదీన ఆన్‌లైన్ అమెజన్‌లో చేతి వాచ్‌ను ఆర్డర్ చేసింది. వాచ్ నచ్చకపోవడంతో రిటన్ చేయడానికి ఆన్‌లైన్‌లోనే ప్రయత్నించింది. ఈ క్రమంలో అమెజన్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ఓటీపీ చెప్పాలని కాల్ వచ్చింది. ఆమె నమ్మి వెంటనే ఓటీపీ చెప్పడంతో అకౌంట్‌లో ఉన్న రూ. 83,286 నగదు కట్ అయినట్లు తెలిపారు. ఐదు నెలలు గడిచినా రికవరీ కాకపోవడంతో శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

బ్రిడ్జికి మరమ్మతు చేయండి



అయిజ: కర్నూల్–అయిజ రోడ్డు రహదారిలో పెద్ద వాగుపై గతంలో నిర్మించిన వంతెన శిథిలమై చాలా కాలమవుతోంది. అక్కడ అనేక సార్లు ప్రమాదాలు సంభవించాయి. బ్రిడ్జి పక్కన కిందిభాగంలో ఏర్పాటు చేసిన రాతిగోడ కొన్నేళ్ల కిందటే శిథిలమైంది. బ్రిడ్జి ఉన్నట్లు సూచించే రక్షణ రాళ్లు విరిగి పోయాయి. వాహనాలు దగ్గరకు వస్తేగాని అక్కడ ప్రమాదం పొంచి ఉందని వారికి తెలియడంలేదు. అధిక బరువు కలిగిన వాహనాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు వెల్తుంటాయి. ఈరోడ్డుపై నిత్యం పరిమితికి మించిన బరువుతో వాహనాలు వెళ్తూనే ఉన్నాయి. అధికారులు స్పందించి నూతన బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు.

పౌరసేవలపై అవగాహన

అమరచింత: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, సేవలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండి, వాటిని వినియోగించుకోవాలని ఆర్‌ఐ గోపాల్, ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని నందిమళ్లలో శనివారం సివిల్స్ రైట్‌డే కార్యక్రమం సందర్భంగా గ్రామ ప్రజలకు పౌరసేవలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలను ప్రజల ఆస్తులుగా భావించి అవి అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో నేరాల నియంత్రణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



పౌర సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యతోనే మంచి భవిష్యత్



అకాడమిక్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు



ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న విద్యార్థులు

అలంపూర్: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రయాగ్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో అకాడమిక్స్ ఎక్స్‌పో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమిక్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులు తమ ప్రతిభకు సృజనాత్మకతను జోడించి టెక్నాలజీతో ముందుకు పోతున్న ప్రదర్శన ఏర్పాటు చేశారు. వైజ్ఞానిక గణిత భాష, భౌగోళిక సంబంధిత అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. అకాడమిక్ ఎక్స్ పోలో ఉంచిన ప్రదర్శనలను ఎమ్మెల్యే వీక్షించారు. విద్యార్థులు పుస్తకాలలో చదువుకున్న పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు అకాడమిక్ ఎక్స్‌పో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సులభ పద్ధతిలో పాఠాలు బోధించాలన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, జిల్లా మత్స్య శాఖ సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, రఘురెడ్డి, చాంద్‌పాషా, రఫీ ప్రయాగ్ స్కూల్ యాజమాన్యం ఉన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి



ధరూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు



ఉండవెల్లిలో..

ధరూరు: ఏడు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే మంజూరు చేయాలని మండల పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 20వేల 769 గ్రామ పంచాయతీలలో వేల మంది పల్లీ వర్కర్స్ కార్మికులుగా పని చేస్తున్నారని, అలాంటి కార్మికులకు వేతనాలు సక్రమంగా అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రంగన్న, శేఖర్, పద్మమ్మ, లచ్చమ్మ, హనుమంతు, దేవరాజు, సుబ్బమ్మ, తిమ్మన్న, శంకర్, ఆశీర్వాదమ్మ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలని మండల తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పరశురాముడు ఎంపీఓ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహేష్, మద్దిలేటి, సుంకన్న, సంధ్యారాణి, సత్యనారాయణ, మద్దిలేటి పాల్గొన్నారు.

కేటీదొడ్డి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ వర్కర్ల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో గోడకు వినతిపత్రం అతికించారు. గ్రామ పంచాయతీల్లో జీతాలు రాని దుస్థితి రాష్ట్రంలో నెలకొందని, వెంటనే పెండింగ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు వీరన్న, తాయప్ప, రామునాయక్ ఉన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం గోడకు వినతిపత్రం అతికించిన కార్మికులు

శాంతినగర్: పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వడ్డేపల్లి ఎంపీఓ తిరుపతన్నకు వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మధు ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రాజోళిలో సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నిరుపేదలకు వేతనాలు అందజేసి న్యాయం చేయాలని కోరారు.

పకడ్బందీగా తనిఖీ చేపట్టాలి

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద పకడ్బందీగా తనిఖీ చేపట్టాలని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా ఉండి కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణ వైపు వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. మద్యం, సార, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వాహనాల రాకపోకలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



నందిన్నె చెక్‌పోస్ట్ తనిఖీ చేసిన సిబ్బంది

వాగుపై వంతెన నిర్మించండి

అయిజ: మండలంలోని సింధనూర్ గ్రామం వద్ద వాగుపై వంతెన నిర్మించక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి ఆయా గ్రామాల ప్రజలు ప్రతిరోజు ప్రయాణం చేస్తుంటారు. వాగు ప్రదేశంలో వంతెన నిర్మించకుండా కొన్ని సంవత్సరాల క్రితం సీసీ బెడ్డు నిర్మాణం చేపట్టారు. వర్షాకాలంలో ఎరువులు, పురుగు మందులు కొనేందుకు ప్రతిరోజు రైతులు ఎద్దులబండ్లు, ఆటోల్లో ప్రయాణం చేయాల్సి ఉంటుది. వాగులు వంకల నుంచి వచ్చిన వరుద నీరు వాగులో వేసిన సీసీ బెడ్డుపై ప్రవహించినంతసేపు ఆ ప్రదేశంలో ప్రయాణానికి ప్రతికూలత ఏర్పడుతుంది. సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పనులు చేపట్టి వర్షాకాలంనాటికైనా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



సింధనూర్ వద్ద వంతెన నిర్మించాల్సిన ప్రదేశం